# లిఫ్ట్

– కప్పగంతుల మల్లికార్జున రావు



ఈవారం కథ

నా కారు బస్‌స్టాప్‌ను సమీపిస్తున్నది.

కారును ఆపాలా! ఆపకుండా పోవాలా?

అలవాటు ఆపమంటున్నది. అనుమానం, భయం ఆపకుండా వెళ్ళమంటున్నది.

వయసులో వున్నపుడు అపుడెపుడో 'మంచి మనసులు' సినిమా చూశాను. అందులో ఎస్వీరంగారావు కనిపించినవారికి కారులో లిఫ్ట్ ఇస్తుంటాడు.

ఆ దృశ్యం నన్ను ఆకర్షించింది.

పెద్దయ్యాక కారు కొని అలా ఉడతాభక్తిగా సేవచేయాలన్న కోరిక నాకానాడు కలిగింది. గాఢమైన కలలా అది నన్ను వెంటాడుతూనే వుంది.

జీవితంలో వైఫల్యాల నెదుర్కొన్నప్పడే నాకా కల గుర్తుకొచ్చేది. పట్టుదలను పెంచేది.

నేను పుట్టు బీదవాడిని. అయినా ఎమ్మెస్సీ చదవగలగడానికి ఆ పట్టుదలే కారణం.

ఎమ్మెస్సీ అయ్యాక లెక్చరర్ ఉద్యోగంలో చేరాను.

లెక్చరర్ ఉద్యోగం! కారు కొనడం అసాధ్యం. కారు కొన్నా మెయిన్‌టైన్ చేయడం అంతకన్నా కష్టం.

కష్టపడి రీసెర్చి చేసి డాక్టర్‌నయ్యాక యూనివర్సిటీలో రీడర్ ఉద్యోగం సంపాదించాను.

అప్పడే స్కూటర్ కొన్నాను.

స్కూటర్‌మీద ఒక వ్యక్తికి లిఫ్ట్ ఇవ్వవచ్చు.

కానీ సరిగ్గా అప్పుడే నాకు పెళ్ళయింది. నా జీవితంలోకి మరో వ్యక్తి ప్రవేశించింది. స్కూటర్‌లో బేక్ సీట్ ఆమెకు రిజర్వ్ చేయక తప్పలేదు. పైగా నేను ఎక్కడికి వెళ్ళినా తాను కూడా వస్తాననేది. అది ఆమె సర్దా.

ఆమె సర్దాని తీర్చాలా? నా చిరకాల వాంఛను తీర్చుకోవాలా?

ఆమె కూడా ఉద్యోగం చేస్తోంది. 'ఎమ్మే సైకాలజీ'

సైకో ఎనాలిసిస్ లాంటి టెక్నిక్కులను నాపైన ప్రయోగించి నా కోరికను తెలుసుకుంది.

'మంచి కోరికే' అంటూ నవ్వింది. ఆ రోజునుంచి ప్రతి పనికి నాతో వస్తాననడం తగ్గించింది.

ఆ విధంగా స్కూటర్‌మీద లిఫ్ట్ ఇచ్చే అవకాశం నాకు కలిగింది.

బస్సుస్టాపుల్లో, బస్సులకోసం ఎదురుచూసే ముసలివాళ్ళు, పిల్లలు, అర్జంటుగా ఎక్కడికో వెళ్ళాల్సి వెళ్ళలేని అసహాయులు...

నేను లిఫ్ట్ ఇవ్వడం వల్ల గమ్యస్థానం చేరుకున్నాక వాళ్ళ కళ్ళల్లో కనిపించే ఆనందం, కృతజ్ఞతాభావం చూస్తున్నప్పుడు నాకు కలిగే తృప్తిని ఎలా వర్ణించడం?

అయినా 'మంచి మనసులు'లో, ఎస్వీరంగారావు నాకు గుర్తుకొస్తూనే వుండేవాడు.

"మీరు త్వరగా కారు కొనాలి సార్" నా భార్య ఒకరోజు హఠాత్తుగా అంది.

ఆమెకు నేను పెట్టిన పేరు 'సహవాసి'.

"అవును. కారు అవసరమే సహవాసీ. కానీ డబ్బు..."

ఇంట్లో కోరికలకు ఎన్నో కోతలు విధించి డబ్బు కూడబెట్టింది.

ఈలోగా నాకు ప్రొఫెసర్‌గా ప్రమోషన్ వచ్చింది.

యూనివర్సిటీవారు కారు కొనడానికి లోన్ కూడా ఇచ్చారు.

కారులో డ్రైవింగ్ సీట్ పార్ట్ మా కుటుంబానిది. బేక్ పోర్షన్ అంతా లిఫ్ట్ ఇచ్చేవారికి కేటాయించాము. బేక్ సీట్‌లో ముగ్గురు కూర్చోవచ్చు. అవసరాన్ని బట్టి మరొకరికి కూడా రూమ్ కల్పించేవాడిని.

ఎవరికి లిఫ్ట్ ఇవ్వాలి అన్నది మొదట్లో మాకో పెద్ద సమస్య అయింది.

చక్కెర కార్డులకు ఎగబడ్డట్టు కారు ఆగీ ఆగగానే బస్సు దగ్గర వాళ్ళంతా ఎగబడేవారు. ఎస్వీరంగారావు సినిమా కాలంలో ఆలా ఎవరూ ఎగబడలేదు.

నేను, సహవాసి కలిసి ఆలోచించి కొన్ని నిర్దిష్ట సూత్రాలు ఏర్పరచాము.

ఆ ఆరో ఇంద్రియం అసహాయుల్ని, అవసరంలో వున్నవారిని ఇట్టే గుర్తించేది.

నా కోరిక తీరింది. అది ఇప్పుడు హాబీగా మారింది.

కొన్ని విమర్శలు వచ్చాయి. కొందరికి శత్రువుని కూడా అయ్యాను.

అయినా నేను చింతించలేదు. ఎందుకంటే నేను చేస్తున్న పని మంచిదని నాకు తెలుసు. దానివల్ల ఎవరికో ఒకరికి చిన్నమెత్తు ఉపకారం జరుగుతున్నదన్న తృప్తి నాకు వుంది.

కానీ రాత్రి నేను, సహవాసి ఒక సినిమా చూశాము.

ఆ సినిమాలో ఇద్దరు ఆడవాళ్ళు నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద ఒక కారును ఆపి లిఫ్ట్ అడుగుతున్నారు.

ఆ కారును యజమానే డ్రయివ్ చేస్తున్నాడు. యువకుడు. అందంగా వున్నాడు.

ఆడవాళ్ళు ఎన్నో జాలికథలు చెప్తారు.

కారు కొంత దూరం పోయాక ఆడవాళ్ళిద్దరూ చెరో రైఫిల్ తీసి అతడిని బెదిరిస్తారు. కారును దారిమళ్ళించి తమకు కావలసిన చోటికి తీసుకెళ్తారు.

అక్కడ ఇద్దరు యువకులు చేర్తారు. నలుగురూ కలిసి యువకుడిని భయపెట్టి ఒక నేరంలో భాగస్వామిని చేస్తారు. ఆ నేరాన్ని అడ్డుపెట్టుకుని అతడిని బ్లేక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతుంటారు. చివరికి ఆ యువకుడు వాళ్ళ ఉచ్చునుంచి ఎలా బయటపడతాడన్నది ఆ సినిమాలో సారాంశం.

ఆ సినిమా చూశాక నాకు ఏదో చెప్పరాని భయం పట్టుకుంది.

మనుషులపై నాకున్న విశ్వాసం సడలిపోవడమే ఆ భయానికి కారణమని నాకు తెలుసు.

మనుషులందరూ మంచివారేనని ఎలా చెప్పడం! ఆ సినిమాను చూసినవారికెవరికైనా అలా తామూ చేయాలన్న బుద్ధిపుడుతుంది. అంత అందంగా తీశాడా సీన్లు!

నేను లిఫ్ట్ ఇచ్చినవారిలో ఎవరికి లాంటి బుద్ధి పుడుతుందో!

ఏ ఒక్కరికి అలాంటి బుద్ధి పుట్టినా నా స్థితేమిటి?

లేనిపోని సమస్యలను తామెందుకు సృష్టించుకోవాలి!

—ఇలాంటి ప్రశ్నలతో నా మనసు నిండిపోయింది.

"మిస్టర్ రావ్. కారు బస్టాప్ దాటిపోయింది. పరాకుగా డ్రైవ్ చేస్తున్నారేం?" సహవాసి హెచ్చరికతో ఆలోచనల నుంచి బయటపడ్డాను.

"ఆవేళనుంచి నో లిఫ్ట్! నో ప్రాబ్లమ్స్"

"ఏం?" ఆశ్చర్యంగా అడిగింది సహవాసి.

కారణంగా నా భయాలు, సందేహాలు పూసగుచ్చినట్టు చెప్పేను.

అంతా విని సహవాసి అందంగా నవ్వింది.

"ఆ సినిమా చూసి మీరలా ఆలోచించారా?"

"నువ్వు ఎలా ఆలోచించావు?"

"ఆ సినిమా కథ రాసినవాడిని, దర్శకుడిని చూసి జాలిపడ్డాను. వాళ్లకు మానసిక ఆరోగ్యాన్ని కలుగజేయమని భగవంతుడిని ప్రార్థించాను ఒక్క క్షణం. ఆ తర్వాత ఆ సినిమాను మర్చిపోయాను"

"వాళ్ళను చూసి నువ్వు జాలిపడడం ఎందుకు? వాళ్ళు నీకన్నా ప్రఖ్యాతులు. ఆ సినిమాతో బోలెడు ధనం సంపాదించారు."

"అందుకే జాలి. ఆ విజయం వారి కీర్తికండూతిని, ధనాశను మరింతగా పెంచుతుంది. మానసిక ఆరోగ్యం మరింత దిగజారుతుంది. అలా అలా దిగజారి దిగజారి చివరికి డబ్బు వుంటే వుండవచ్చునేమో కాని, మానసిక శాంతి మాత్రం వుండదు. ఆ అశాంతితోనే చస్తారు"

"వాళ్ల సంగతి సరే. కానీ ఆ సినిమాలు చూసిన ప్రేక్షకుల మాటేమిటి? వారు పెడదోవపట్టరా?"

సహవాసి చిత్రంగా నవ్వింది.

"ఎవరో నీలాంటి బలహీనులు తప్ప సినిమాలను సీరియస్‌గా తీసుకునేదెవరయ్యా ప్రొఫెసర్! ఇవాళ చూస్తారు. రేపు మరిచిపోతారు. అయినా నూటికి కోటికి ఎవడో ఒక్కడు దుర్మార్గుడుంటాడని చేసే ఒక్క మంచి కార్యాన్ని ఇలా ఆపడం నీకు భావ్యమా?"

నా ఆలోచనల్లో తప్పని నేను తెలుసుకున్నాను.

మర్నాటినుంచి లిఫ్ట్ ఇచ్చే కార్యక్రమం మామూలుగా కొనసాగింది.

* * *

ఆ రోజు నగరానికి వంద కిలోమీటర్ల దూరంలో వున్న ఓ గ్రామంలో


## NORTH INDIA TOURS

| | | Frequency | Fare Rs |
|---|---|---|---|
| 1. | Delhi-Badrinath-Kedarnath-Gangotri-Yamunotri-Delhi | Every Friday | * 2,500 |
| 2. | Delhi-Badrinath-Kedarnath-Delhi | Every Mon / Fri | * 1,300 |
| 3. | Delhi-Allahabad-Varanasi-Gaya-Ayodhya-Delhi | Every Friday | 2,000 |
| 4. | Delhi-Simla-Kulu-Manali-Chandigarh-Delhi | Every Friday | 2,000 |
| 5. | Delhi-Agra-Ajmer-Pushkar-Delhi | Mon / Thu | 650 |
| 6. | Delhi-Mussoorie-Haridwar-Rishikesh-Delhi | Tue / Fri | 400 |

Fare includes Dormitory accommodation, Transport & Guide services.
* Veg.South Indian Meals will be served on tour at extra payment.
We are running LTC Tours for Central Govt. employees in collaboration with ITDC. All Tours are by Super Deluxe Buses, starting from our New Delhi Office. Contact our Offices at Madras Ph: 564864, Bangalore Ph: 2262633, Vijayawada Ph: 62227 and Vizag Ph: 545565 for advance Reservations. మీరు ఢిల్లీ వచ్చినపుడు ఆధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 100 రూములు గల "హోటల్ సదరన్" లో బస చేయండి. ఢిల్లీలో రుచికరమైన తెలుగు భోజనం మా హోటల్లోని " అమరావతి / సుప్రభాత్ " రెష్టారెంట్లలో లభించును.

**SOUTHERN TRAVELS/HOTEL SOUTHERN**


Recognised by Dept. of Tourism, Govt. of India, New Delhi.

**ఢిల్లీలోని తెలుగు వారి ప్రముఖ వాణిజ్య సంస్థ**

18/2, Arya Samaj Road,
W.E.A, Karol Bagh,
New Delhi - 110 005.
Ph.5739508, 5782932,5724085

Hotel Ayodhya Complex,
11-5-428, Lakdi-ka-pool,
Hyderabad - 500 004.
Ph: 223658,227233

SUVARNA



పెళ్ళికి వెళ్ళి కారులో తిరిగివస్తున్నాం.

చీకటిపడింది. ఇంకా నగరం నలభై కిలోమీటర్ల దూరంలో వుంది. రోడ్డు మీద పెద్ద ట్రాఫిక్ లేదు.

నలుగురు యువకులు రోడ్డుమీద నిలబడి కారు ఆపమని సౌంజ్ఞ చేసేరు.

నేను సహజంగా యువకులకు లిఫ్ట్ ఇవ్వను.

అయినా కారుని అనుకోకుండానే స్లో చేసేను.

ఇది సిటీ కాదు. హైవేలో, పాపం బస్సులు దొరక్క వాళ్లు ఎంత సేపటి నుంచి వెయిట్ చేస్తున్నారో!

కారు ఆపి నలుగురు యువకుల్ని ఎక్కించుకున్నాను. కారు స్పీడ్ అందుకోబోతున్నది.

'స్లో డౌన్ ది స్పీడ్ అండ్ టర్న్ టు లెఫ్ట్'

బేక్ సీట్‌నుంచి కమేండ్. లైట్ వేసేను.

నలుగురి చేతుల్లో నాలుగు కత్తులున్నాయి. అందులో రెండు కత్తులు ఒకటి నా వీపుకి, మరొకటి సహవాసి వీపుకీ గురిపెట్టబడి వున్నాయి.

అప్పుడు నాకు గుర్తుకువచ్చింది– అది నక్సలైట్ల ప్రాబల్యం ఎక్కువగా వున్న చోటని.

కానీ నక్సలైట్లు నాలాంటివారి జోలి కెందుకొస్తారు?

నేను వారికి శత్రువును కానే. కనీసం యూనివర్సిటీ రాజకీయాల్లో కూడా నేను కలిగించుకోనే!

"కూల్‌డౌన్ బాయిస్. మీరేం చెప్తే అది చేస్తాను. మీరు తొందరపడకండి. నేను..."

"నాకు నీ చరిత్ర అంతా తెలుసు. నువ్వు చెప్పనక్కర్లేదు. ముందు ఆ చెట్లచాటున కారు ఆపు"

నేను కారు ఆపేను.

"మీదగ్గర వున్న వస్తువులన్నీ ఇవ్వండి. డబ్బు, బంగారం, వాచీలు,..."

వాళ్ళు అడగక ముందే సహవాసి మెళ్ళో వున్న నగలన్నీ తీసి వారికిచ్చి వేసింది. నేను నా వాచీని, జేబులో పర్స్‌ని ఇచ్చేశాను.

"సారీ. ఇంతకన్నా ఎక్కువ తీసుకురాలేదు. పర్స్‌లో రెండువేలు మాత్రమే వుంది. మీకిది చాలకపోతే మా ఇంటిదాకా వచ్చే శ్రమ తీసుకోండి."

వాళ్ళు నలుగురూ నవ్వారు.

"అది మరోసారి. ఇప్పటికిది చాలు ప్రొఫెసర్. గుడ్‌బై"

"మీరెవరు? నక్సలైట్లా?"

"కాదు. వారి బాబుల్లాంటి వాళ్ళం– ఎక్సలెంట్లం. మా గురించి నీకనవసరం. కానీ వొక్క విషయం గుర్తుంచుకో. నువ్వు మేమెవరిమో తెలుసుకోలేవు"

అంతసేపు మా ఆవిడ నిబ్బరంగానే వుంది.

కానీ వాళ్ళటు వెళ్ళగానే ఆమెకు దుఃఖం పొర్లుకొచ్చింది. ఏడవసాగింది. ఆమె ఏడవడం నేనంతవరకు పెళ్ళయిన దగ్గరినుంచి చూడలేదు.

"నగలు పోయినందుకు ఏడుస్తున్నావా సహవాసీ!" అడగాలనిపించింది. కానీ అడగలేదు. ఎందుకంటే ఆమె స్త్రీ. స్త్రీలకు భర్త, బిడ్డల తరువాత ప్రియమైన వస్తువు బంగారం అంటారు. పైగా సహవాసి తన కష్టార్జితంతో కూడబెట్టి చేయించుకున్న నగలవి.

"నీ బాధ నేనర్థం చేసుకోగలను సహవాసీ. కానీ దిగులుపడకు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో టాప్ రేంక్స్‌లో నా శిష్యులు చాలామంది వున్నారు. ఒక్క ఫోన్ చేస్తే చాలు. నీ బంగారం రేపీ పాటికల్లా నీ మెడలో వుంటుంది."

"నేను బంగారం పోయినందుకు ఏడవడం లేదండీ. మీ స్కూళ్ళు, కాలేజీలు ఇలాంటి విద్యార్థుల్ని తయారు చేస్తున్నాయే అని ఏడుస్తున్నాను. వాళ్ళు నా కళ్ళకు నక్సలైట్లుగా కనిపించలేదు. దొంగలుగా కూడా కనిపించలేదు. నిరుద్యోగులుగా కనిపించారు. ఏదో అవసరం కొద్దీ దోచుకుపోయి వుంటారు. కానీ చదువుకున్న యువకులు ఎందుకిలా పెడదోవ పడుతున్నారు? అదీ నా బాధ, ఏడ్పు"

కొద్దిగా సిగ్గుపడి తలవంచుకోక తప్పలేదు నాకు.

* * *

వారం రోజులు గడిచిపోయాయి.

నేను మామూలుగానే కారులో లిఫ్ట్ ఇస్తున్నాను.

మా బంగారం దోపిడీని గురించి పోలీసులకే కాదు– ఎవరికీ చెప్పకూడదని మేమిద్దరం కలిసి నిర్ణయించుకున్నాం.

"విద్యావిధానం వల్ల, విద్యాలయాల వల్ల, అసమర్థులు స్వార్థపరులు అయిన ఉపాధ్యాయుల వల్ల విద్యార్థుల్లో కొందరు నిరాశతో పెడమార్గాలు పడుతూ వుండవచ్చు. కానీ ఆ విద్యార్థులలోనుంచే ఎందరో ప్రతిభావంతులు కూడా తయారవుతున్నారే! ఎవరో నలుగురు చేసిన పనికి మొత్తం వ్యవస్థనే నిందించడం భావ్యమా?"

నా వాదన సహవాసికి నచ్చింది.

జరిగింది ఒక పీడకలగా భావించి మర్చిపోయాం ఇద్దరం.

ఆరోజు రాత్రి–

'వివిధ రంగాలలో విలువలు పడిపోవడానికి దేశంలోని రాజకీయాలు ఎంతవరకు కారణం?' అన్న అంశంపై టీవీలో చర్చాగోష్ఠి జరుగుతుంటే చూస్తున్నాం ఇద్దరం. పాల్గొంటున్నవారంతా ఆయా రంగాలలో ప్రసిద్ధిపొందిన మేధావులే.

కానీ వాళ్ళల్లో ఒక్కరు కూడా తాము నమ్మిన సత్యాన్ని చెప్పడం లేదు. సత్యాలను అర్థసత్యాలతో, అసత్యంతో కలిపి భాషాభేషజంతో ఏమేమో చెబుతున్నారు. ఆకుకి అందని, పోకకు పొందని అభిప్రాయాలవి.

"దేశంలో అన్ని అనర్థాలకు మూలం– మేధావుల హిపోక్రసీ. నేను భరించలేను" అంటూ సహవాసి లేచింది.

నేను టీవీ కట్టేయబోతుండగా కాలింగ్‌బెల్ మోగింది.

తలుపు తీసేను. నలుగురు యువకులు చాలా దూకుడుగా లోపలికి వచ్చి తలుపు బిగించారు.

నేను వారిని గుర్తించాను. ఆనాడు బంగారునగలు తీసుకెళ్ళినవాళ్ళే.

"వెల్‌కమ్ మైడియర్ బోయిస్. ప్లీజ్ టేక్ యువర్ సీట్స్..."

వాళ్ళు కూర్చునేలోగానే సహవాసి డ్రింక్స్ తీసుకువచ్చింది.

"మీరు ఇన్నాళ్ళుగా రాకపోతే ఆశ్చర్యపోయాం. వెల్‌కమ్. మీకేం కావాలో అడగండి. ఇస్తాము. కానీ మీ రైఫిళ్ళను చూసి భయపడి మాత్రం కాదు. మిమ్మల్ని చూసి జాలిపడి."

"జాలా? ఎందుకు?"

"జీవితాన్ని గురించి పాజిటివ్‌గా ఆలోచించాల్సిన వయసులో నెగెటివ్‌గా ఆలోచించి దొంగలయినందుకు"

అప్పుడే అసలు విషయం చెప్పేరు వాళ్లు.

వాళ్లు నలుగురూ నేను కారులో లిఫ్ట్ ఇవ్వడం ఎప్పటినుంచో గమనిస్తున్నారు. నేను ఎందుకలా చేస్తున్నానో వారికి అర్థంకాలేదు.

ఆ పిచ్చి సినిమాను మేము చూసిన రోజే వాళ్లూ చూశారు.

ఆ తర్వాత నేను లిఫ్ట్ ఇవ్వడం మానేస్తాననుకున్నారు.

కానీ ఆ ఆచారాన్ని కొనసాగించడం వాళ్లకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది.

"సినిమా చూసి ఆయన మారకపోవచ్చు. ఎందుకంటే అది సినిమా

> "మా బంగారం దోపిడీ గురించి పోలీసులకే కాదు– ఎవరికీ చెప్పకూడదని మేం నిర్ణయించుకున్నాం"

కమక. ఆ అనుభవం తనది కాదు కమక. కానీ ఆ అనుభవం స్వయంగా తనకే అయితే తప్పక మారతాడు. మనుషుల పైన ఆయనకున్న విశ్వాసం పటాపంచలవుతుంది. కావాలంటే బెట్ కాస్తాను"

నలుగురూ చర్చించుకున్నారు. పందాలు కాసుకున్నారు.

ప్రణాళిక ప్రకారం మా నగల్ని దోచుకున్నారు.

"మాస్టారూ అన్ని కాసుల బంగారం పోగొట్టుకున్న మీ భార్య మీపై వత్తిడి తెచ్చి మీ అలవాటును మాన్పిస్తుందనుకున్నాము. కానీ మా అంచనాలన్నీ తప్పయ్యాయి మాస్టారూ. మేము ఓడిపోయాము. మనుషుల పట్ల మీకున్న అచంచల విశ్వాసం మమ్మల్ని కదిలించివేసింది మాస్టారూ. మీలాంటి పురుషులు, ఆమెలాంటి స్త్రీలు ఊరికి పదిమంది వుంటే, ఈ భ్రష్ట సినిమాలకు, రాజకీయాలకు విరుగుడుగా వుంటారు మాస్టారూ..."


వాళ్ళు ఆనాడు తీసుకెళ్ళిన సొమ్మును సహవాసి పాదాల వద్ద వుంచి నమస్కరించారు.

'ఎలిమెంటరీ స్కూల్ లెవెల్‌లోనే విద్యార్థుల్లో ఉన్నత విలువల పట్ల అవగాహన కల్పించవలసిన అవసరం వుంది' టీవీలో భ్రష్ట మేధావి చెబుతున్నాడు.

"బాబూ.. మమ్మల్ని పరీక్షించి మీరు సాధించిందేమీ లేదు. పొగిడి సాధించబోయేది కూడా ఏమీ లేదు. మాలాంటివాళ్లు ఊరికి పదిమంది వుంటే చాలన్నారు. కానీ పదిమంది కాదు. వందలు, వేల సంఖ్యలో వున్నారు. కానీ వారికి నోరు లేదు. నోరున్న ఇలాంటి దగుల్బాజీ మేధావులు తమ హిపోక్రటిక్ భావాలతో, సిద్ధాంతాలతో, సత్యస్వరూపులని, సత్యాన్ని అణగదొక్కేస్తున్నారు. వారిలోని ఆ హిపోక్రసీని చంపగలిగితే- సత్యస్వరూపులు లక్షల సంఖ్యలో కనిపిస్తారు. పొగడ్తలతో మీ శక్తిని వృధా చేయకండి. మీ శక్తిని- మనిషిమీద విశ్వాసం పెంచుకునే వాతావరణం ఏర్పడడానికి కృషిచేయండి. అందుకే ఈ నగలు వాడండి" సహవాసి స్థిరంగా అంది.

ఆ నలుగురూ ఆమెవైపు చూశారు. కళ్లతో మాట్లాడుకుని చేతులు కలిపారు. ఆ ఎనిమిది చేతులు ఎనిమిది కోట్ల చేతులవుతాయనిపించింది.

ఆ క్షణంలో నేను పొందిన అనుభూతిని-



'వాళ్ళు ఆనాడు తీసుకెళ్ళిన సొమ్మును సహవాసి పాదాల వద్ద వుంచి నమస్కరించారు."

కష్టపడి చదివి పైకి వచ్చినప్పుడు కాని-

అక్షరాలా సహధర్మచారిణి అయిన సహవాసిని పొందినవుడు కాని-

ఇల్లు కట్టుకున్నప్పుడు కాని-

అకడమిక్‌గా అవార్డులు పొందినవుడు కాని-

కారులో కొన్ని వేలమందికి 'లిఫ్ట్'లు ఇచ్చినప్పుడు కాని-

పొంది వుండలేదు.

ఎందుకంటే మానవతకు ఊపిరి పోసే దివ్యానుభూతి అది!

మనుషుల పట్ల విశ్వాసాన్ని 'లిఫ్ట్' చేసే మహత్తర శక్తి అది!


*On the 8th of September get rewarded for studying so hard.*

# APTECH MERIT SCHOLARSHIPS

The entrance exam for the Aptech Leadership Awards '96 will be held on September 8. It's your opportunity to get scholarships for Aptech software engineering courses. Considering all the hard work you put in to be successful in your exams, you deserve this reward. So, contact your nearest Aptech Centre for admissions.

LEADERSHIP AWARDS 1996

**APTECH**
**COMPUTER EDUCATION**
**We change lives**

*For further details contact Nearest* **APTECH** *Centres* **Hyderabad:Ameerpet,Ph.293057 * A S Rao Nagar,Ph.861959 *Alwal** : 7,7A, Saraswati Nagar, 'Aptech House, Lothkunta ***Balanagar, Ph.279795 *Barkatpura, Ph.7605809 /661593* Basheerbagh, Ph.240424/243175 * Habsiguda, Ph.670999 * Kothapet , Ph.873121 *Malakpet, Ph.4412107 *Mehdipatnam, Ph.224042/225264* R C Puram, Ph.284195 * Secunderabad,Ph.7702422 * Vijayawada Area Office, Gandhi Nagar Ph.76499 *Vijayawada,Ph.473781 * Tenali** : Ist Floor, J J Complex, Bose Road ***Cuddapah, Ph.22285 * Tirupati, Ph. 22651 * Chittoor, Ph.24959 * Madanapalle,Ph.63644 *Nellore, Ph.23325/26285 *Visakhapatnam, Ph.546569 *Gajuwaka,** Laxmi Complex,**Ph.513575 *Anantapur, Ph.21359 *Hindupur, Ph.30897,*Adoni,** Sree Ram Nagar . A A S College Road ***Kurnool, Ph.27811 *Nandyal, Ph.45566 *Guntakal, Ph.46855, *Karimnagar, Ph.41212 *Warangal, Ph.26768 *Hanumakonda, Ph.75336 *Nizamabad, Ph.31676 *Rajahmundry, Ph.61789 *Bhimavaram, Ph.3266 * Tanuku** : 10, Ramlakshmi Complex, IInd Floor, R P Road ***Kakinada, Ph.78758 *Eluru, Ph.24303 *Amalapuram,** K Agraharam Ph.22418 ***Khammam, Wyra Road *Guntur, Ph.234336 *Narsaraopet, Ph.24866 *Ongole,** Corporation Bank Gandhi Nagar.

**http://www.indiaworld.com/aptech**

**OPEN ON SUNDAY**